# నేరము - శిక్ష

మధ్యాహ్నం పన్నెండు అయింది.

మగతగా పడుకున్న ఇన్‌స్పెక్టర్ విజయ్‌కు గోడ గడియారం పన్నెండు గంటలు కొట్టడం వినిపించింది. ఆ తర్వాత వినిపించింది , అతనికి నచ్చలేదు.

కాలింగ్ బెల్ ట్రింగ్ ట్రింగ్ అని ఆగకుండా మోగుతున్నది.

విజయ్‌కు కోపం వచ్చింది . వచ్చేటప్పుడు స్టేషన్‌లో చెప్పొచ్చాడు. - సాయంత్రందాకా తన్ని డిస్టర్బ్ చేయవద్దని . రాత్రల్లా కంటిమీద కునుకులేదు. బందిపోటు దొంగల బెడద,తనక్కడ జీపులో పెట్రోలింగ్ చేశాడు. అందుకే భోజనం చేసి కాసేపు నడుం వాలుద్దామనుకుంటే ఈ బెల్.

విసుక్కుంటూ లేచితలుపు తీశాడు – వచ్చిన కానిస్టేబుల్ నుతలవాచేట్లు చివాట్లు పెడదామని.

కళ్లెదుట అందాల భరిణె!

"ఎవరికోసం ?" అతి ప్రయత్నం మీద విసుగు కన్పించకుండా జాగ్రత్తపడ్డాడు.

"ఇన్‌స్పెక్టర్ విజయ్ మీరేనా ?" ఆమె సందేహంగా అడిగింది.

తలాడించేడు.అంతే! ఆమె అతని అనుమతి లేకుండా లోనికి వచ్చి ఓ కుర్చీలో కూర్చుంది.

విజయ్‌కు కోపం వచ్చినా సర్దుకున్నాడు.

"మిమ్మల్ని ఎక్కడా చూసినట్లు లేదు."

"అవును లేదు."

"మరి?"

"మీతో పని వుండి వచ్చాను."

"అఫీషియల్?"

"ఆ! అలాంటిదే!"

"సారీ! సాయంత్రం స్టేషన్‌కు రండి."

"కాని నేను అక్కడినుండే వస్తున్నాను."

"సో వాట్ !నేను ఆఫ్‌లో వున్నాను." కటువుగా చెప్పాడు

సన్నగా ఏడ్పు వినిపించింది.

విజయ్‌కు ఆమె మీద సదభిప్రాయంపోయింది.

"సారీ! ఇది అఫీషియల్ కాదూపర్సనల్ కాదూ!" ఆమె చెప్పింది పైట కొంగుతో కన్నీరు తుడుచుకుంటూ.

మెంటల్‌కేసాని సందేహం కలిగింది అతనికి.

"మీ సలహా కోసం వచ్చాను."

"సారీ, నేను లాయర్నికాను - డాక్టర్ని కాను సలహా యివ్వడానికి – సలహా కోసం తగినవార్ని వెతుక్కుంటూ వెళ్లమని నా సలహా!" వేళాకోళంగా అన్నాడు.

"నా గొడవలో పట్టించుకోలేదు– మీరు నిద్ర పోయే మూడ్‌లో వున్నారు కదూ- అయితే వెళ్లండి. నేను బయట వెయిట్ చేస్తూ వుంటాను." ఆమె దీనంగా చెప్పింది.

"ఓ.కె.! మీకు పది నిమిషాలు టైమిస్తున్నాను. చెప్పండి మీకేం కావాలి?" అనీజీగా ఫీలవుతూ అడిగాడు.

"సావిత్రి అని నాకో స్నేహితురాలుంది. ఆమె భర్తతో హాయిగా కాపురం చేసుకుంటున్నది. అటువంటిది వారం క్రింతట ఆమెను...." వెక్కి వెక్కి ఏడ్చింది ఆమె.

"మర్డర్ చేశారా?"

"కాదు. రేప్ చేశారు!" వణుకుతున్న కంఠంతో చెప్పింది.

"బాపురే!" బావుండదని ఆశ్చర్యం నటించాడు.

"ఆ రాత్రి ఆమె ఒంటరిగా వుంది భర్త క్యాంప్ నుండి వస్తాడని ఎదురుచూస్తూ. కాలింగ్ బెల్ వినిపిస్తే అతడేనేమోనని తలుపు తీసింది. కాని ఆమె భర్త స్నేహితుడు లోపలికి వచ్చాడు. అతను తరచుగా వస్తూంటాడు. కాబట్టి లోపలికి రానిచ్చింది. ఆ తర్వాత-" మళ్ళీ ఏడ్చింది.

"ప్లీజ్! మీరు చెప్పనక్కరలేదు. నాకు అర్థమైంది."

"ఆ దుర్మార్గుడిని మీరు ఎట్లాగైనా శిక్షించాలి."

"ఆమె కంప్లయింట్ యిస్తే ప్రయత్నిస్తాను."

"అంత కూల్‌గా చెబుతున్నారు- అతనికి శిక్ష వేయించలేరా?" కోపంగా అడిగింది ఆమె.

"ఓకే - నే అడిగిందానికి సూటిగా సమాధానం చెప్పండి. ఆమెను రేప్ చేస్తున్నప్పుడు ఎవరైనా చూశారా? ఐమీన్ ఐ విట్‌నెస్ వుందా?"

"ఎంత అర్థం లేని ప్రశ్న అడిగారు?" ఆమె తిరస్కారంగా అంది."మూడో మనిషి వుంటే అతనెందుకు బలాత్కరిస్తాడు? అలా చేస్తే ఈ మూడో మనిషి రక్షించకుండా వూరుకుంటాడా? రేప్‌లకు సాక్ష్యాలు వుండవు."

"పోనీ- ఆమె డాక్టర్ దగ్గరికి పోయి....."

"సారీ - ఆ అర్ధరాత్రి ఎక్కడికి పోతుంది ఆడది? పోలేదు. అసలు ఆ ఆలోచన కూడా రాలేదు."

"మరి ఏ ఆధారంతో అతన్ని నేను అరెస్టు చేయాలి?" కోపంగా అడిగాడు.

"ఒక ఆడది తన్ను అతను రేప్ చేశాడని కంప్లయింట్ యిస్తే అది చాలదా? హైందవ స్త్రీ ఆ విషయాల్లో అబద్ధం చెప్పదుగా!"

అతను చట్టం నెమరువేసుకుంటూ మౌనంగా వుండిపోయాడు. దొంగలు పడ్డ ఆరు నెల్లకు కుక్కలు మొరగడం అంటే యిదే అనుకుని, "మరి యింతకాలం ఎందుకు ఆలస్యం చేశారు కంప్లయింట్ యివ్వకుండా?"

"అక్కడే మీ సహాయం కావల్సింది. ఆమె గుట్టు చప్పుడుకాకుండా మొగుడితో కాపురం చేసుకుంటున్నది. తను యిలా కంప్లయింట్ యిస్తే ఆ భర్త ఎంతటి విశాల హృదయుడైనా ఎలా భరిస్తాడు? ముందు పదిమంది ముందు అల్లరిపాలవుతుంది. తన గౌరవం మంటకలుస్తుంది. తర్వాత తన కాపురం కుప్పకూలుతుంది- అని యిన్నాళ్లు మదనపడింది."

"మరి యిప్పుడెందుకు?"

"పేపర్లో మీ గురించి చదివాం! మాస్నేహితురాలి సమస్యకు ఏదైనా పరిష్కారం

చూపిస్తారేమోనని" ఆశగా అడిగింది ఆమె.

ఇన్‌స్పెక్టర్ విజయ్ కాసేపు దీర్ఘాలోచనలో పడ్డాడు.

"చూడండీ! మేం ఏ కేసుపెట్టి అతన్ని అరెస్టు చేసినా అతన్ని కోర్టుకు హాజరుపరచక తప్పదు. అక్కడ సాక్ష్యాలు లేకపోతే కేసు కొట్టేస్తారు. ఆ తర్వాత పోలీసు జులుం నశించాలి అని పేపర్లో పెద్దక్షరాలతో రాస్తారు!" తను తలుపు వైపు అడుగువేస్తూ చెప్పాడు.

ఆమె లేచింది. "అంతేనంటారా? ఈ కర్మ భూమిలో ఒక అబలకు లభించే న్యాయం యింతేనంటారా? సాక్ష్యాలు లేకుండా నేరాలు చేసి ఈ నేరస్తులు చట్టానికి అందకుండా తిరుగుతూంటే మీ చట్టం చూస్తూ వూరుకుంటుందా? పేపర్లో మీ గురించి రాసింది అంతా నిజమని మా సావిత్రి నన్ను పంపింది- తనెంత పిచ్చిదో నాకిప్పుడే అర్థమైంది. వెళ్లొస్తాను- మీకు నిద్రాభంగం కల్గించినందుకు సారీ" విసురుగా వెళ్లబోయింది ఆమె.

"ఇంతకూ మీ పేరు?"

"సీత!" ఆమె మెరుపులా మాయమైపోయింది.

ఆ తర్వాత ఎంత ప్రయత్నించినా విజయ్‌కు నిద్రపట్టలేదు.

సీత యింకో స్లీపింగ్ పిల్ మింగి నీళ్ళు తాగింది. ఎంతకీ నిద్రపట్టడంలేదు.

ఆమె పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలాగా వుంది.

భర్త రామనాథం క్యాంపుకి వెళ్ళాడు . ఆమెకు అలా ఒంటరిగా వుండడం పెళ్ళయిందగ్గరనుండి అలవాటే! కాని ఈ మధ్య జీవితం దుర్భరమైపోయింది.

కళ్ళు మూసినా తెరిచినా అనంత్ రూపం కన్పిస్తున్నది. మర్చిపోదామన్నా మరువలేకపోతున్నది.

ఇన్ని సంవత్సరాలు ప్రాణప్రదంగా దాచుకున్న శీలాన్ని ఆ దుర్మార్గుడు హరించాడు.

చెప్పు కుందామంటే భర్త వదిలేస్తాడేమోనని భయం అసలే అతను సంకుచిత స్వభావుడు!

అదీ గాక లోకం దృష్టితో తను పతిత! లోకం కారణం చూడదు.

తను అందగత్తె కావడం తన తప్పుకాదు.

అందరిలా సంసారం చేసుకుందామనుకోవడం తన తప్పుకాదు! మానవత్వాన్ని నమ్ముకుని వేళకాని వేళపరాయి మొగాడ్ని అందునా మొగుడి ఆప్తమిత్రుడ్ని పలకరించడం ఆమె సంస్కారం తప్పుకాదు.

అలా జరగాలని రాసిపెట్టిన దేవుడిది తప్పు ! ఆ కాళరాత్రి ఆమెకు జరిగిన అన్యాయం ! ఎంగిలిపడ్డానన్న భావన! గుండెపొరల్లోంచి దుఃఖం పొర్లుకొస్తున్నది.

ఇన్‌స్పెక్టర్ విజయ్ మీద పెట్టుకున్న చివరిఆశ యిగిరిపోయింది.

ఆ మర్నాడు పల్లికిలించుకుంటూ వచ్చాడు అనంత్ "రామనాథం వచ్చాడా ?" అంటూ.

భగ్గున మండిపోయింది ఆమెకు.

రెండు మూడు రోజులు అనంత్ భయపడి ఆ ఛాయలకుకూడా రాలేదు. రామనాథం కల్సినపుడు మామూలుగా ప్రవర్తించడం వలన ఆ సంగతి సీత అతనికి చెప్పలేదని నిర్ధారించుకున్నాడు. అంతేగాక ఆమె ఎటువంటి కంప్లయింట్ చేయకపోయేసరికి అతను యింకో రకంగా ఊహించుకున్నాడు. ఆమెకు తనంటే యిష్టమేనని , కాని , ఆడువారి మాటలకు అర్థాలువేరు అనే సామెతలా ఆమె కోపం ప్రదర్శిస్తున్నదని.

"రాత్రికి వస్తాడా?" కన్నుగీటుతూ అడిగాడు.

"రావచ్చు - రాకపోవచ్చు" అసహ్యంగా చెప్పింది.

"అయినా రాత్రికి వచ్చి ఓ సారి చూసిపోతాను అర్జెంటు పనివుంది."

"గెట్‌వుట్!" కోపంగా అరిచింది.

అనంత్ యికిలించుకుంటూ వెళ్లిపోయాడు.

ఆమె ఒంటి మీద తేళ్ళు, జెర్రులు పాకాయి.

ఆ యిల్లు ఊరికి దూరంగా డెవలప్ అవుతున్న కాలనీలో, దురదృష్టం కొద్దీ ఆమె యిల్లు ఒకటిలా ఒంటరిగా వుంది. ఆ యింటికి దూరంలో యిళ్లున్నాయి కాని పక్కనగాని ఎదురుగాగాని లేవు. ఇంకా కరెంటువాళ్ళకి కనికరం లేకపోవడంతో స్ట్రీట్ లైట్లు లేవు.

సీతకు యిల్లు వదిలి ఎక్కడికిపోవాలో అర్థం కావటం లేదు. పోతే పుట్టింటికి పోవచ్చు. కాని ఆయన వస్తే తను మళ్లీ ఆ ఊర్నించి ఈ ఊరికి రావాలి. చెప్పాపెట్టకుండా పోతే ఆయనకు కోపం వస్తుంది.

ఆమె శరీరం ప్రతీకార జ్వాలతో కాగిపోతున్నది.

రాత్రి ఎనిమిది దాటింది.

అనంత్ నెమ్మదిగా అడుగులేసుకుంటూ ఆ యింటి ముందు కొచ్చాడు. లైట్స్ వెలగడంలేదు కాబట్టి ఆ యింటిముందు చీకటి రాజ్యమేలు తున్నది. అదీ ఒకందుకు మంచికే. అన్నాడు.

వరండాలోకి ప్రవేశించాడు ఇంట్లో ఎక్కడా దీపాలు వెలగడం లేదు.

జాగ్రత్తగా విన్నాడు.

బాత్ రూమ్‌లో నీళ్ళ చప్పుడు వినిపిస్తున్నది. బహుశా సీత స్నానం చేస్తున్నట్లుంది.

అనంత్‌కు ఆనందం కలిగింది.

"సీతా! సీతా!" చిన్నగా పిలిచాడు.

లోపలి నుండి సమాధానం రాలేదు.

స్విచ్ బోర్డు కోసం చేత్తో తడుమూతూ పోతున్నాడు - ఆ కారుచీకట్లో.

కాలింగ్ బెల్ నొక్కి ఆమె భర్త వచ్చినట్లు భ్రమింపచేద్దామనుకున్నాడు.

రెండు మూడు సార్లు స్విచ్ బోర్డు ఎక్కడుందో చూశాడు కాబట్టి పెద్ద శ్రమ లేకుండా ఆ బోర్డు మీద వెయ్యగలిగాడుచెయ్యి.

అంతే!

అతను పెట్టిన కేకకు ఆ కాలనీ దద్దరిల్లింది.

ఆ వెంటనే లైట్లు వెలిగాయి.

దూరంగా నేల మీద గిలగిల కొట్టుకుంటున్నాడు అనంత్.

కొన్ని క్షణాల్లోనే అనంత్ ప్రాణాలు అనంత వాయువుల్లో కల్సిపోయాయి.

సీత నిశ్చేష్టురాలై నిల్చుండిపోయింది.

జనం పోగయ్యారు.

ఇంతలో రామనాథం రిక్షాలోంచి దిగాడు సూట్‌కేసుతో. తదుపరి కార్యక్రమాలు చకచకా జరిగిపోయాయి.

పోస్టుమార్టం జరిగింది. కరెంట్ షాక్‌తో అనంత్ మరణించాడని నిర్ధారించబడింది.

ఇన్‌స్పెక్టర్ విజయ్ కేసు క్లోజ్ చేశాడు - అందరి స్టేట్ మెంట్లు తీసుకున్నతర్వాత, అంతకు ముందు -

"ఇప్పటికైనా ఆ స్విచ్‌బోర్డు బాగు చేయించండి" ఓరోజు సలహా యిచ్చాడు విజయ్ పెట్రోల్ చేస్తూ అక్కడికి వచ్చి.

"అస్సలీ యింట్లోనే మేం వుండం. ఖాళీ చేస్తున్నాం, "రామనాథం చెప్పాడు.

"అది వేరే విషయం - యింకోసారి యిలా దుర్ఘటన జరగకుండా వుండాలంటే మీరు ఎలక్ట్రీషియన్ను పిలిపించి సరిచేయించండి."

"తప్పకుండా! నిన్నే కబురుచేశాను." సీత చెప్పింది. "ఈ పాటికి రావల్సింది."

"కాని తమాషాగా వుంది - కొత్త యిల్లు కొత్త వైరింగ్ - కొత్త స్విచ్ బోర్డు - అప్పుడే రిపేరు కెలా వచ్చిందబ్బా ? " ఆశ్చర్యంగా అడిగాడు విజయ్ !

ఉలిక్కిపడింది సీత.

"దాందేముందండి ! అన్నిట్లో కల్తీ! దీనిలోనూ నాణ్యత లేదు. "రామనాథం లా పాయింట్ తీశాడు

"కాదండి ! కాన్ని పిల్లలు క్రికెట్ ఆడుకుంటున్నప్పుడు బంతి తగిలి బద్దలైనట్లుంది." సీత కారణం వివరించింది.

"ఒక సిక్సర్ ఖరీదు ఓ నిండు ప్రాణం నవ్వాడు." బయటికి వెళ్తూ ఇన్‌స్పెక్టర్ విజయ్.

"నేను హంతకురాలిని. నన్ను ఉరితీయండి," ఆమె ఆవేశంలో ఏడుస్తూ చెప్పింది.

డాక్టర్ ఇంజక్షన్ చేశాడు. ఇన్‌స్పెక్టర్ విజయ్ డాక్టర్‌ని అడిగాడు ఆమెకెలా వుందని.

"ఆవేశపడుతున్నది - విశ్రాంతి కావాలి. షి ఈజ్ సైకిక్ !"

సీత విజయ్‌ని గుర్తు పట్టింది.

"హలో సర్ మీరు యిక్కడ? "

"మా మిత్రుడ్ని అడ్మిట్‌చేస్తే చూడ్డానికి వచ్చాను - వెళ్తుంటే మీగొంతు విని వచ్చాను." విజయ్ చెప్పాడు.

"మంచి పని చేశారు - వెంటనే నన్ను అరెస్టు చెయ్యండి. "

"ఇదండి వరస! " డాక్టర్ నెత్తి బాదుకున్నాడు.

ఇన్‌స్పెక్టర్ విజయ్ సైగచేశాడు. డాక్టర్ నర్స్ బయటకు వెళ్ళారు. సీత పక్కలో కూర్చున్నాడు, ఆమె తలమీద చెయ్యివేసి.

"ప్లీజ్! నన్ను ఉరికంబం ఎక్కించండి. నాకు బతకాలని లేదు"! ఏడుస్తూ చెప్పింది.

"మీరు డిశ్చార్జి అయింతర్వాత మాట్లాడుకుందాం- "

"నో! మీరు నే చెప్పేది వినాలి."

"మీవారు రాలేదా?" ఆసక్తిగా అడిగాడు.

"వాడా! ఛీ! పరమ దుర్మార్గుడు"! అసహ్యంగా మొహం పెట్టింది.

"సీత పుట్టిన దేశంలో మొగుళ్ళని అసహ్యించుకునే భార్యలు పుట్టడం నిజంగా దురదృష్టం!"

"ఆనాటి రాముడు ఏకపత్నీవ్రతుడు - కాని నా రాముడు కృష్ణుడండి-" ఏడుస్తూ చెప్పింది.

"ఇంత చిన్న కారణానికే -!" ఆశ్చర్యపోయాడు.

"చిన్న కారణమా! ఆ ! మీ మొగవాళ్లంతా అంతే! ఎంగిలిపడ్డ శరీరాన్ని నా భర్తకు ఎలా

సమర్పించాలా అని కుమిలిపోతున్న నాకు- నా భర్త వేశ్యాలోలుడు అని తెలిస్తే ఎలా వుంటుంది?"

"సారీ! మీ పర్సనల్ విషయాల్లో నాకు ఆసక్తి లేదు". లేస్తూ అన్నాడు.

"ఇన్స్పెక్టర్! అనంత్‌ది యాక్సిడెంటల్ డెత్ కాదు- నేనే మర్డర్ చేశాను. అతను కరెంట్ షాక్‌తో చనిపోయినా ఆ షాక్ కొట్టించింది నేనే!"

"ఐ నో యిట్! ఈ విషయం నాకు ముందే తెల్సు!" తాపీగా చెప్పాడు ఇన్స్పెక్టర్ విజయ్.

"వ్హాట్! మీకు తెల్సు-తెల్సా? ఎలా?!"

"యస్! కొత్త స్విచ్‌బోర్డు క్రికెట్ బాల్‌కు పగిలిందని చెప్పినప్పుడు నిర్ధారణ చేసుకున్నాను. అనంత్ మీ వరండాలో చనిపోయినప్పుడు అది మీ పనే అని అనుమానించాను."

"వండర్‌ఫుల్! నామీద మీకు అనుమానం ఎందుకు కలిగింది?" అనుమానంగా అడిగింది.

"బలాత్కరించబడిన భారత స్త్రీ అంత సులభంగా దాన్ని మర్చిపోలేదు కాబట్టి."

"రేప్ జరిగిందని నేను మీకు చెప్పలేదే!"

"సావిత్రి, సీత ఒక్కరే అని తెలుసుకోలేక పోవడానికి నేను అమాయకుడ్ని కాను. సావిత్రి గురించి చెబుతున్నప్పుడు మీ మొహంలో కలిగిన భయాలు, మీ గొంతుపలికిన ప్రతీకార జ్వాలలు సీతే సావిత్రి అని నాకు చెప్పాయి." వివరించాడు.

"మరి నన్ను ఎందుకు అరెస్టు చెయ్యలేదు?"

ఇన్స్పెక్టర్ విజయ్ పెద్దగా నవ్వాడు.

"ఏ సాక్ష్యం లేక నేను 'అనంత్'ను అరెస్టు చెయ్యలేకపోయానో అదే సాక్ష్యం లేక మిమ్మల్నీ! అదీ గాక మీ కాపురం కూల్చడం నాకిష్టం లేదు. విడదీయడంకన్నా చేతనైతే కలపమన్నారు. కాని నాకర్థంగానిది మీ భర్తమీద మీ అభిప్రాయం ఎందుకు మారింది?"

"ఆయనకంతా తెల్సిపోయింది- నిద్రలో కలవరించానట. అంతే. ఆయనకు నామీద అసహ్యం పుట్టింది-" ఏడ్చింది.

"ఆమెకు రెస్టు యివ్వండి" అంటూ డాక్టర్ ప్రవేశించాడు.

(సిరివెన్నెల : సంసారపక్షపత్రిక 20 -5-1990)

